

చిత్తూరులో ఉద్యోగుల భారీ ర్యాలీ

పంట 'ఎండి'.. గంగకు 'గండి'

ప్రజాశక్తి - బాలాయపల్లి

అన్నదాతలు ఆరుగాలం కష్టించి పండిస్తున్న పంటకు సాగునీటి కొరత రావడంతో బంగారంపేట నుంచి వస్తున్న తెలుగుగంగ ప్రధాన కాల్వకు పది గ్రామాలకు చెందిన రైతులు గండి కొట్టి కయ్యూరు చెరువు సప్లై ఛానల్‌కు నీటిని వదులుకున్నారు. దీంతో తెలుగు గంగ అధికారులు కస్సుమన్నారు. రైతులు వేసిన పైప్‌లైన్‌ను పగలగొట్టి రైతులపై కేసులు పెడతామని బెదిరించడంతో రైతులు వాగ్వివాదానికి దిగారు. బాలాయపల్లి మండలం అక్కంపేట, వెంగమాంబపురం, కయ్యూరు, వేణుగోపాల్‌పురం, బాలాయపల్లి, వెంకటగిరి రూరల్ అగ్రహారం, కందనాలపాడు, అమ్మపాలెం గ్రామాలకు చెందిన రైతులు దామాషాలు వేసుకుని తెలుగుగంగ కాల్వ నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేసుకుని కయ్యూరు చెరువు సప్లై ఛానల్ కాల్వకు నీటిని వదులుకున్నారు. దీంతో గంగ అధికారులు ఆ పైప్‌లన్ పగలగొట్టడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలుగుగంగ అధికారుల వైఖరి వల్ల దాదాపు 300 ఎకరాల పైన పంట కళ్లెదుటే ఎండుతుందని, తమ కళ్లెదుటే నీరు ఉన్నా తాము వాడుకోలేని దయనీయ స్థితి అని వారు వాపోయారు.

కళ్లెదుటే ఎండుతున్న పంట

అప్పులు చేసి ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి అందే సమయంలో నీటి కొరత ఏర్పడింది. దీంతో దిగుబడి రాదన్న భయంతో సాగునీటి కోసం ఆందోళన చెందుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుగంగ కాల్వకు వస్తున్న నీటిని కొంతమేరకైనా వదులుకుని ఆ పంటలను కాపాడుకోవాలని పైప్‌లైన్ ఏర్పాటు చేసుకున్నారు. అయితే తెలుగుగంగ అధికారులు పంటలు ఎండిపోతున్నా పట్టించుకోకుండా నీటిపైప్‌లైన్ పగలగొట్టారని మీడియాతో అన్నదాతలు వాపోయారు. తామేమీ నీటిని దొంగతనం చేయడం లేదని, కళ్ల ముందే గంగ పోతున్నా తమకు సాగునీటికి దిక్కులేదన్నారు. దీర్ఘకాలికంగా తమకు ఈ సమస్య ఉన్నా ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం వల్లనే తాము పైప్‌లైన్ వేసుకోవాల్సి వచ్చిందన్నారు. పంటల కోసం కయ్యూరు సప్లై ఛానల్ కాల్వకు నీటిని మళ్లించుకున్నామే తప్ప, తామేమీ అమ్ముకోలేదని అధికారులపై మండిపడ్డారు. రైతు సుభిక్షంగా ఉంటేనే అందరూ సుభిక్షంగా ఉంటారన్నారు. పైప్‌లైన్ పగలగొట్టిన ప్రాంతాన్ని టిడిపి నాయకులు సిసి నాయుడు మంగళవారం పరిశీలించారు.

తెలుగుగంగ ప్రధాన కాల్వను పరిశీలిస్తున్న మాజీ ఎంఎల్ఎ

ఉద్యమం తీవ్రతరం

ఏపి జెఎసి నేతల హెచ్చరిక

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్

ఆర్థిక బకాయిల చెల్లింపు, సిపిఎస్ రద్దు, పిఆర్‌సి, డిఎ బకాయిల చెల్లింపు వంటి సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఏపి జేఏసి నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏపి జేఏసి, ఎన్‌జీవో సంఘం పిలుపు మేరకు మంగళవారం స్థానిక పివికెయన్ కళాశాల నుండీ కలెక్టరేట్ వరకు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపి జేఏసి రాష్ట్ర కార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో మొద్దనిద్ర పోతోందన్నారు. తమ న్యాయమైన డిమాండ్లపై సానుకూలంగా స్పందించి పరిష్కరించకుంటే ఫోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసి ఛైర్మెన్ కెవి రాఘవులు, కార్యదర్శి రఘు, జిల్లా కార్యదర్శి ముత్యాలరెడ్డి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్‌నాయుడు, ఎస్‌టియు నాయకులు మదనమోహన్‌రెడ్డి, ఎపిటిఎఫ్ చంగల్‌రాయ మందడి పాల్గొన్నారు.

సమ్మెలో భాగంగా శిబిరం వద్దే వంటావార్పు

వంటావార్పుతో వ్యవసాయ కళాశాల కార్మికుల నిరసన

ఐదో రోజు నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - క్యాంపస్

కనీస వేతనం ఇవ్వాలన్న ప్రధాన డిమాండ్‌తో వ్యవసాయ కళాశాల కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి ఐదో రోజుకు చేరింది. మంగళవారం వంటావార్పుతో కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి గండికోట నాగ వెంకటేష్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఫిబ్రవరి 16వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టామన్నారు. గత 22 సంవత్సరలుగా పనిచేస్తున్న కాంట్రక్టు కార్మికులకు కనీస వేతనలు అమలు చేయడం లేదని, సుప్రీం తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని, టైంస్కేలు ఇవ్వడం లేదని వాపోయారు. ప్రతినెలా జీతాలివ్వలని, టైంస్కేల్ అమలు చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్, ప్రమదబీమా ఐదు లక్షలు ఇవ్వాలని, ప్రభుత్వ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జయచంద్ర, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు, యూనియన్ అధ్యక్షురాలు వరలక్ష్మి, కార్యదర్శి రాకేష్, నాయకులు సుబ్బు, రేవతి, చంద్రమ్మ, అనురాధ, మునిలక్ష్మి, రమా, మురళి పాల్గొన్నారు

గుడిసెవాసుల సమావేశంలో మాట్లాడుతున్న హరినాథ్

ఇంటి స్థలాలు చూపకుంటే... ఎంఎల్ఎ బియ్యపు ఇంటికి పేదల పాదయాత్ర

ప్రజాశక్తి - రేణిగుంట

'ఇంటి స్థలాలు చూపకుంటే ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఇంటికి రేణిగుంట మండలం కరకంబాడి ఎర్రగట్టు నుంచి రెండువేల మందితో పాదయాత్ర చేపడతాం' అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, మండల నాయకులు కె.హరినాథ్ అన్నారు. మంగళవారం ఇంటి స్థలాల పోరాట కమిటి ఆధ్వర్యంలో కరకంబాడి పంచాయతీలోని ఎర్రగుట్టపైన గుడిసెలు వేసుకున్న పేదలతో మంగళవారం బహిరంగసభ నిర్వహించరు. ఈ సందర్భంగా అంగేరి పుల్లయ్య, కె.హరినాథ్ పేదల పోరాటానికి సంఘీభావం తెలిపారు. జనవరి 26 నుంచి ఈ గుట్టపైనే నాలుగువేల మంది పేదలు గుడిసెలు వేసుకుని ఉంటున్నారని, అర్హత ఉన్నా ఇంటి స్థలం రాలేదన్నారు. శ్రీకాళహస్తి ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డి న్యాయం చేసేంత వరకూ ఈ కరకంబాడి ఎర్రగుట్ట దిగేది లేదన్నారు. బుధవారం ఉదయం శ్రీకాళహస్తి ఎంఎల్ఎ ఇంటి వద్దకు వెళ్లి ఇంటి స్థలాల పోరాట కమిటి, సిపిఎం జిల్లా నాయకులు కలవబోతున్నామన్నారు. పేదలకు న్యాయం జరగని పక్షంలో రేణిగుంట నుంచి ఎంఎల్ఎ ఇంటి వరకూ రెండువేల మంది పేదలతో పాదయత్ర చేస్తామన్నారు. రేణిగుంట మండల పరిధిలోనే ఇంటి స్థలాలు చూపించేంత వరకూ ఎంఎల్ఎ ఇంటి వద్దనే కూర్చుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటి స్థలాల పోరాట కమిటీ అధ్యక్షులు రాజశేఖర్, కార్యదర్శి సత్యశ్రీ, శివనందం, సెల్వరాజ్ పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

ప్రజాశక్తి - రామకుప్పం

మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన సెల్వరాజ్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారానికి పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు ...సెల్వరాజ్ అనే యువకుడు జులాయిగా తిరుగుతుండేవాడని , ఈ క్రమంలో ఏడో తరగతి చదువుతున్న బాలిక పాఠశాల ముగిసిన తర్వాత ఇంటికి వెళ్లే క్రమంలో సెల్వరాజ్ బాలికపై అత్యాచారం చేసినట్లు సమాచారం. కాగా రామకుప్పం ఎస్ఐ శివకుమార్‌ను వివరణ కోరగా బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

స్ట్రాంగ్‌రూమ్‌లు సిద్ధం : కలెక్టర్

తిరుపతి టౌన్ : జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించామని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్, అనోమాలిస్, అలాట్మెంట్ ఆఫ్ కామన్ సింబల్స్‌పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశమయ్యారు. నియోజకవర్గాల పరిధిలోని అన్ని పోలింగ్‌కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ఫర్నిచర్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ఫారం 9, 10, 11 కు సంబంధించి టెక్నికల్ సమస్య ఉందన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ పెంచల్‌కిషోర్, ఈఆర్ఒలు కోదండ రామిరెడ్డి, చంద్రముని, అతిథి సింగ్ పాల్గొన్నారు.

'జనశక్తి-మనశక్తి' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ వైఎస్సార్ సీపీ నేత కాపురెడ్డి కష్ణారెడ్డి ప్రచురించిన జనశక్తి- మన శక్తి పుస్తకాన్ని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఆవిష్కరించారు. స్థానిక పద్మావతి పురంలోని భూమన నివాసం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ కాపురెడ్డి కష్ణారెడ్డి రచించిన ఈ పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కష్ణారెడ్డి, ముని చంద్రారెడ్డి, రాజారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఈస్ట్ పోలీస్ స్టేషను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి తూర్పు పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మల్లిక గర్గ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న మొదటి వారం లోనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, స్థితిగతులను తెలుసుకోవడానికి ఆమె నడుం బిగించారు. ఈ నేపథ్యంలో తిరుపతి పోలీస్ సబ్ డివిజన్ తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, వివిధ గదులు, ఎస్హెచ్ఓ, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం జనరల్ డైరీ, కేసు డైరీ, కోర్టు క్యాలెండర్ వంటి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ తిరుపతి నగరం నడిబొడ్డున తిరుపతి తూర్పు పోలీస్ స్టేషన్ పరిధి విస్తరించి నగరానికి ఆయువుపట్టు లాగా ఉన్నదని, ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో రైల్వే స్టేషన్, బస్ స్టేషన్ లు నెలకొని వాటికి అనుబంధంగా విష్ణు నివాసం, శ్రీనివాసం మాధవం వంటి యాత్రికుల వసతి సముదాయాలు ఏర్పాటై ఉన్నాయి. ఇటువంటి యాత్రికుల రద్దీ ప్రదేశాల్లో పిక్ పాకెటర్లు, పిల్లలను అపహరించే వారు తమ చేతివాటం చూపించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా గట్టి నిఘా పెట్టాలన్నారు. ఫిర్యాదుల విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీస్ అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు భాస్కర్ రెడ్డి ఎస్బి, సురేంద్ర రెడ్డి తిరుపతి, సీఐ మహేశ్వరరెడ్డి తిరుపతి ఈస్ట్‌పాల్గొన్నారు.

గతం కన్నా ఘనంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

దక్షిణ కైలాసంగా, వాయులింగ క్షేత్రంగా ప్రసిద్ధికెక్కిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను గతంకన్నా ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ఈవో నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక ఆలయ పరిపాలనా భవనంలో మహాశివరాత్రి ఏర్పాట్లు, ఉత్సవాల విజయవంతంపై ఈవో మంగళవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతి ఏటా నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు గొప్ప చరిత్ర ఉందన్నారు. స్వామీ అమ్మవార్ల దర్శనార్థం లక్షల కొద్దీ భక్తులు తరలి వస్తుంటారని చెప్పుకొచ్చారు. గతేడాది నిర్వహించిన ఉత్సవాలకు లక్షకు పైగా భక్తులు స్వామీ అమ్మవార్లను దర్శించుకున్నట్లు తెలిపారు. ఈ సారీ లక్షకు పైగా భక్తులు రానున్నట్లు సమాచారమన్నారు. ఈ నేపథ్యంలో భక్తుల కనీస సౌకర్యాలపై ప్రధానంగా దష్టిసారించినట్లు తెలియజేశారు. భక్తుల కనీస అవసరాలైన తాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్, ట్రాఫిక్, నీడ ప్రదేశాలు, స్నాన ఘట్టాలు, క్యూలైన్లు, అన్న ప్రసాదాలు ఆ మేరకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల తాకిడి దష్ట్యా' చోరీలు జరగకుండా ఈ ఉత్సవాల్లో సీసీ కెమేరాలతో పాటు వాచ్ టవరు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా రెండు మార్పులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దూర్జటి కళా ప్రాంగణాన్ని రాజగోపురం వద్దకు మార్చి ఆ ప్రదేశాన్ని పార్కింగ్ కు కేటాయిస్తున్నట్లు తెలిపారు. అయితే దూర్జటి కళా ప్రాంగణం వద్ద పార్కింగ్ ఏర్పాటు చేస్తే దాని ప్రాశస్త్యం దెబ్బతింటుందనీ, ట్రాఫిక్ కష్టాలు కూడా ఏర్పడతాయని పాత్రికేయులు సూచించడంతో పరిశీలించి మార్పులు చేస్తామని తెలిపారు.

చిన్నారి ప్రజ్న్యా రాయల్‌కు అభినందనలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం సంపాదించిన చిన్నారి ప్రజ్న్యా రాయల్ ను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, తిరుపతి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ ఆత్మీయంగా గుండెలకు హత్తుకుని ముద్దాడారు. చిన్నారి ప్రజ్న్యా తల్లి దండ్రులు యోగేష్, జ్యోతిర్మయి లను అభినందిస్తూ, చిన్నారిని ఇదే తరహాలో అన్ని విధాలా ప్రోత్సహిస్తూ, చిన్నారి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలని సూచించారు.

నేటి నుంచి జ్యూవెలర్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఉమ్మిడి బంగారు జ్యువెలర్స్ తిరుపతిలో ఈ నెల 21, 22 తేదీలలో తాజ్ తిరుపతిలో సాంప్రదాయ ఆభరణాలు, వివాహ ఆభరణాల కలెక్షన్ ప్రదర్శనను నిర్వహించనున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ పార్ట్నర్ అమరేంద్ర తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి తిరుచానూరు రోడ్డులోని తన పల్లి క్రాసు వద్దనున్న తాజ్ హెూటల్లో రెండు రోజులపాటు ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రతిరోజు ఉదయం 11 గంటల నుండి రాత్రి 8 గంటల మధ్య జరిగే ఈ ప్రదర్శనలో అత్యంత అందమైన బంగారు ఆభరణాల కలెక్షన్లో క్లాసిక్ లక్ష్మీ మోటిఫ్‌లు, అందం, అధునాతన, సంప్రదాయం సంపూర్ణ సమ్మేళనమైన నెమలి నేపథ్య పీసెస్ ఉన్నాయి. కళాత్మకంగా రూపొందించిన నెక్లెస్‌లు, చెవిరింగులు, వివిధ మెటీరియల్స్ తో తయారు చేసిన ముక్కు పుడకలు ప్రదర్శించబడతాయి. కస్టమర్‌లకు మార్గనిర్దేశం చేయడానికి, ప్రతి ఆభరణం సూక్ష్మ నైపుణ్యాలను వివరించడానికి వీబీజే సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదు

చికెన్, గుడ్లు నిరభ్యంతరంగా తినొచ్చు

పశు సంవర్ధక శాఖ అధికారి రవికుమార్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ / గూడూరు

తిరుపతి జిల్లాలో బర్డ్‌ఫ్లూ వ్యాధి లక్షణాలు ఎక్కడా లేవని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి, రామచంద్రాపురం, వడమాలపేట, తిరుపతి రూరల్, రేణిగుంట, పుత్తూరు మండలాల్లోని 18 పౌల్ట్రీ ఫారలను తనిఖీ చేశారు. కోళ్ల ఆరోగ్య స్థితిగతులను సమీక్షించారు. పౌల్ట్రీ ఫారాల్లో కోళ్లు సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాయని తెలిపారు. ఏమైనా అవాంఛనీయ పరిస్థితులు ఎదురైతే ఎదుర్కొనేందుకు 85 ఆర్ఆర్‌టి బృందాలు ఉన్నాయన్నారు. పశు వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉన్నారన్నారు. చికెన్, కోడిగుడ్లను నిరభ్యంతరంగ తినవచ్చని అన్నారు.

గూడూరు మండల పరిధిలోని మిట్టాత్మకూరు గ్రామాల్లోనూ బర్డ్‌ఫ్లూ లేదని పశు వైద్య సహాయ సంచలకులు బి.సురేష్ తెలిపారు. కోళ్ల దుకాణల్లోని కోళ్లను, పెరటికోళ్లు, పౌల్ట్రీ ఫారాలను గూడూరు ప్రాంతీయ పశు వైద్య వ్యాధి నిర్ధారణ కేంద్రం ఉపసంచాలకులు డాక్టర్ మృణాళిని, డాక్టర్ సుధారాణిలతో కలిసి తనిఖీ చేశరు. పక్క జిల్లాల్లో వ్యాధి ఉన్నందున జిల్లా సరిహద్దు గ్రామాల్లోని కోళ్లు, కౌజుపిట్టల నుంచి రక్త నమూనాలు సేకరించి క్లోయకల్ స్వాబ్స్ సేకరించి పరీక్షకు పంపామని తెలిపారు. ఏమైనా అవాంఛనీయ పరిస్థితులు ఎదురైతే సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు గూడూరు మండలంలో మూడు, బాలాయపల్లిలో రెండు ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. **నారాయణవనంలో...** మండల పశువుల ఆస్పత్రి సహాయ సంచాలకులు డాక్టర్ భార్గవి, డాక్టర్ కుమార్ మండలంలోని కీలగరం, కొండలచెరువు, ఎరుకంబట్టు, తుంబూరు, నైనేరు కండ్రిగ, పాలమంగళం సమీపంలోని కోళ్లఫారాలు, పెరటికోళ్లను పరిశీలించి సూచనలు చేశారు. మండలంలో ఐదు ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు ఏర్పాటు చేశారు. కోళ్లల్లో ముక్కు కళ్లు వెంబడి నీరు కారడం, మెడ వాల్చడం, నీరసంగా ఉండటం, కాళ్లు, శరీర భాగాలపై మచ్చులు ఏర్పడటం, తలపై భాగం ఉండే వాటిల్స్ ఉబ్బడం వ్యాధి లక్షణాలుగ వివరించారు.

రామచంద్రాపురం (చంద్రగిరి) : బర్డ్‌ఫ్లూతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నారావారిపల్లి పశు వైద్య కేంద్రం వెటర్నరీ సర్జన్ డాక్టర్ వంశీ అన్నారు. చంద్రగిరి మండలంలోని భీమవరం, మిట్టపాలెం ప్రదేశాల్లో కోళ్లఫారాలను, పెరటికోళ్లను తనిఖీ చేశారు.

గూడూరులో కోళ్లకు పరీక్షలు చేస్తూ..

జగన్ సర్కర్ ఎన్ని ఇబ్బందులు పెట్టినా...

అన్నా క్యాంటీన్లను ఆపేది లేదు

'నిజం గెలవాలి' పర్యటనలో నారా భువనేశ్వరి

గుడిపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తూ

ప్రజాశక్తి - గుడిపల్లి

'అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌లో ఆకలి అనే పదం వినబడకూడదనే మహోన్నత లక్ష్యంతో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు 2018లో అన్నాక్యాంటీన్లను ప్రారంభించారని, రాష్ట్రవ్యాప్తంగా 364 క్యాంటీన్లను ఏర్పాటు చేశారని, అయితే జగన్ సర్కార్ అన్నా క్యాంటీన్లను నిలిపేసి పేదవాని పొట్టకొట్టింది' అని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. కుప్పం నియోజకవర్గంలో రెండు రోజుల 'నిజం గెలవాలి' పర్యటనలో భాగంగా గుడిపల్లిలో అన్నాక్యాంటిన్‌ను మంగళవారం ఆమె ప్రారంభించారు. అదేవిధంగా 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా ఇటీవల చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుతో తీవ్ర మనోవేదనతో మృతిచెందిన కొడతాంపల్లి వాస్తవ్యుడు వెంకటేష్ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. అలాగే యముగానిపల్లికి చెందిన కొండప్ప కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. అన్నా క్యాంటిన్ ప్రారంభించిన అనంతరం నారా భువనేశ్వరి మీడియాతో మాట్లాడుతూ కుప్పం కుటుంబ సభ్యుల ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటిన్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, కుప్పం నియోజకవర్గ సమన్వయ కన్వీనర్ ఆర్.చంద్రశేఖర్, మాజీ జడ్‌పిటిసి బేటప్పనాయుడు, మండల అధ్యక్షులు బాబునాయుడు, నాయకులు శ్రీనివాసులు, హేమంబార్ గౌడ్ స్వాగతం పలికారు. అంతకుముందు కర్నాటక రాష్ట్రం కోలార్ జిల్లా బేటరాయణహల్లి గ్రామంలో నంది గోశాలను సందర్శించి గోమాతకు పూజ చేశారు. అక్కడనుంచి రోడ్డు మార్గంలో గుడిపల్లికి విచ్చేశారు. బుధవారం కుప్పం, రామకుప్పం, శాంతిపురం మండలాల్లో పర్యటించనున్నారు.

నేడు రామకుప్పంలో పర్యటన

రామకుప్పం : ఎన్టీఆర్ ట్రస్టు ఛైర్మన్ నారా భువనేశ్వరి బుధవారం రామకుప్పంలో పర్యటించనున్నారని చంద్రబాబు పిఎ మనోహర్, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మునస్వామి, మండల అధ్యక్షులు ఆనందరెడ్డి, కార్యదర్శి నరసింహులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం పోలీసు స్టేషన్ సర్కిల్ వద్ద అన్నా క్యాంటీన్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. మాజీ మండలాధ్యక్షులు ఆంజనేయరెడ్డి, నేతలు సీతాపతి, చిన్నక్రిష్ణ పాల్గొన్నారు.

రామకుప్పంలో సన్నాహక ఏర్పాట్లు

వీధి వ్యాపారులకు గొడుగుల పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వేసవి నేపథ్యంలో ఎండతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న వీధి వ్యాపారులకు ప్రత్యేక రాయలసీమ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కూరపాటి సురేష్ బాబు ఆధ్వర్యంలో గొడుగులను మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. తిరుపతి నగరంలో పుట్ పాత్ లపై సామాన్య చిరు వ్యాపారులు బతుకు జీవనం సాగిస్తున్నారని, వారికి ఎండ వేడిమి నుండి ఉపశమనం కల్పించాలనే ఉద్దేశంతో ఈ గొడుగుల వితరణ చేస్తున్నామని సురేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక రాయలసీమ సాధన సమితి ప్రతినిధులు నాగరాజు రెడ్డి, అబ్దుల్ రఫీ, సురేష్, సుదర్శన్ పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : గూడూరులోని గమళ్ల పాలెంలో మెప్మా , మున్సిపాలిటీ సౌజన్యంతో నిర్వహిస్తున్న మై ఫెండ్స్ అసోసియేషన్ వసతి గృహంలో మయూరి శ్యామ్ యాదవ్ ఆధ్వర్యంలో నిరాశ్రయులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పదన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. యువత సేవా కార్యక్రమాలు వైపు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో మయూరి శ్యామ్ యాదవ్, సతీమణి మహేశ్వరి, వసతి గృహ నిర్వాహకుడు రమేష్ పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ పై అవగాహన

ప్రజాశక్తి- వాకాడు: మండలంలోని మొలగునూరు పశువైద్యాధికారి సిహెచ్ఎస్ కృష్ణారావు పశు విజ్ఞాన కార్యక్రమంలో భాగంగా బుడిథలవాగు, , కొండూరు వావిళ్ళ పాలెం పరిసర ప్రాంతాలను మంగళవారం సందర్శించారు. స్థానికులకు బర్డ్ ఫ్లూపై అవగాహన కలిగించారు. వాటితో పాటు వారి కోళ్లను పరిశీలించి వారికి తగిన జాగ్రత్తలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణారావు మాట్లాడుతూ వారంలో రెండు ఆర్ఆర్‌టి టీములు అన్ని గ్రామాలను సందర్శించి కోళ్ల పెంపకదారులకు తగు సూచనలు అందిస్తారని, ప్రస్తుతానికి మండలంలో ఎటువంటి బర్డ్ ఫ్లూ లక్షణాలతో కోళ్లు లేవని వాటిపై అపోహలు వద్దని తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని ప్రభుత్వ పాల్ టెక్నిక్ కళాశాలలో వైఎన్ఆర్ క్రికెట్ టోర్నమెంట్ ను వైసీపీ రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి కొండూరు సునీల్ రెడ్డి, గూడూరు ఎంపిపి గురవయ్య చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడూరు పట్టణ, మండల పరిధిలో 13 జట్లు పాల్గొంటున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విద్యాసాగర్, అశోక్ పాల్గొన్నారు.

ఆట స్థలం కేటాయించండి

ప్రజాశక్తి- వెంకటగిరి : తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణంలోని 23వ వార్డు భూ తోటలో ఆట స్థలాన్ని ఏర్పాటు చేయాలంటూ వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్యకు మహిళలు మంగళవారం ఫిర్యాదు చేశారు. భూ తోటలో ప్రైవేట్ లేఅవుట్ లో తామంతా స్థలాలు కొని ఇల్లు కట్టుకున్నామని ఈ లేఔట్‌లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇక్కడ నివసించే వారికి పబ్లిక్ పర్పస్ స్థలాన్ని కేటాయించాలని మహిళలు కమిషనర్‌ను కోరారు. ఆ స్థలాన్ని పరిశీలించి వివిధ ఆటల పోటీలలో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, కరాటే పోటీలలో రాష్ట్రస్థాయి పాల్గొన్న తమ పిల్లలకు ప్రాక్టీస్ చేసుకునేందుకు ఈ పబ్లిక్ స్థలాన్ని ఆట స్థలంగా ఏర్పాటు చేయాలని మహిళ కోరారు. స్పందించిన కమిషనర్ నాయీ బ్రాహ్మణ భవన నిర్మాణం పక్కనున్న స్థలంలో సర్వే నిర్వహించి అనంతరం నిర్ణయిస్తామని వారికి తెలిపారు. ఈ పరిశీలనలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, టౌన్ ప్లానింగ్ సర్వే పట్టణ సర్వేయర్ రాజగోపాల్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

ప్రజాశక్తి -రేణిగుంట : రేణిగుంట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో 'బేటీ పడావో, బేటీ బచావో'ను నిర్వహించారు. బాల్య వివాహాలు నిర్మూలనలో భాగంగా రేణిగుంట, ప్రధానోపాధ్యాయులు, విష్ణువర్ధనం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11 సంవత్సరాల నుంచి 16 సంవత్సరాల బాలికలకు, బాల్యవివహాలు చేసుకుంటే బాలికలు అనారోగ్యానికి గురై మానసిక ఒత్తిడిని తట్టుకోలేక అనేక రకాలుగా, విద్య, , జీవితానికే అభివృద్ధి దూరమవుతుందని, తల్లిదండ్రులు బాలికలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాత వివాహం చెయ్యాలంటే . చైల్డ్ హెల్ప్ లైన్ కి గానీ, తమకు గాని లేదా, గ్రామంలో వున్న అంగన్‌వాడీ టీచర్స్ తెలపాలన్నారు. వ్యక్తి గత పరిశుభ్రతను పాటించాలని సిడిపిఓ కృష్ణ మంజరి తెలిపారు . ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్, హేమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులుగా కుప్పయ్య, శ్రీనివాసులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ లోని ఏడుకొండల బస్ స్టాప్ వద్ద ఆటో యూనియన్ ఎన్నికల్లో అధ్యక్షులుగా కుప్పయ్య, కార్యదర్శిగా శ్రీనివాసులు ఎన్నికైనట్లు సిఐటియు జిల్లా నాయకులు టి సుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి పోలింగ్ సాయంత్రం వరకూ జరిగింది. సాయంత్రం కౌంటింగ్ నిర్వహించారు. అధ్యక్షులుగా కుప్పయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎన్.శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్ఎం శ్రీను, జాయింట్ సెక్రటరీగా కేశవులు గెలుపొందినట్లు మునికృష్ణ ప్రకటించారు. నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్, పరశురాం ఎన్నికలను పరిశీలించారు. నూతనంగా ఎన్నికైన నాయకత్వం 150 మంది కార్మికులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడంలో ముందుండాలన్నారు.

'రైతులకు ఎరువుల కొరత రానివ్వం..'

ప్రజాశక్తి - ఓజిలి : రైతులకు ఎరువులు కొరత లేకుండా విరివిగా పంపిణీ చేస్తామని సహకార సంఘం అధ్యక్షురాలు ఉచ్చూరు శోభారాణి అన్నారు. మండలంలోని కురుగొండ సొసైటీలో క్రిప్కో యాజమాన్యం ఆధ్వర్యంలో రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఈ సీజన్ లో వరి, మిరప పంటలకు అవసరమైన ఎరువులను క్రిప్కో వారి ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులు రసాయన ఎరువులు కన్నా సేంద్రియ ఎరువులను ఎక్కువగా వాడాలని తెలిపారు. అనంతరం రైతులకు క్రిప్కో ఎరువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్రిప్కో మార్కెటింగ్ అధికారి మురళీధర్, సీఈఓ రవీంద్ర, వైసీపీ నేత ఉచ్చూరు హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పించాలి

ప్రజాశక్తి -ఏర్పేడు : ఉపాధి కూలీలకు వంద రోజులు పని విరివిరిగా కల్పించాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సివి శ్రీనివాస్ ప్రసాద్ ఆదేశించారు. ఏర్పేడు మండలంలోని కోబాక పంచాయతీలో అమృత సరోవర్ పనిని మంగళవారం తనిఖీ చేశారు. రైతులకు ఇస్తున్న పండ్లు, పూల తోటల వివరాలు కూలీలకు తెలిపి వాటి పెంపకానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతిరోజూ 272 రూపాయలు కూలీ పొందేలా వేతన దారులు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కార్యక్రమాధికారి అవిలాల దేవరి, జూనియర్ ఇంజనీర్ పాండజా బాలాజీ రావు, టెక్నికల్ అసిస్టెంట్ సాలి మనోహర్, ఈశ్వరయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

అబాకస్‌లో 'శేషశాయి' విద్యార్థుల హవా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విశ్వం ఎడ్యుకేషన్ స్కూల్ ల్యాబ్ నిర్వహించిన అబాకస్ పోటీ పరీక్షల్లో శేషశాయి విద్యార్థులు బి చౌహాన్ స్టార్ జూనియర్స్ లో మొదటి బహుమతి సాధించి జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి చేరుకున్నాడు. వేదిక్ మ్యాథ్స్ లో జి లహరి ఏడవ తరగతి, పి వైష్ణవి 9వతరగతి తృతీయ బహుమతి సాధించారు. కన్వర్లేషన్ సీనియర్ లెవెల్‌కు పి శర్వణ యాదవ్ ఐదవ తరగతి ఎంపికయ్యారు. కష్టేఫలి అన్నట్లు శేష సాయి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల ఆ పాఠశాల డైరెక్టర్ కె రమేష్, ఎస్‌వి సుబ్బయ్య, డి జయ ప్రకాష్, శారద నరసింహన్. ఎస్ కె మనోజ్ అభినందనలు తెలిపారు.

రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక మంగళవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా భాగ్యలక్ష్మి చెంచురెడ్డి, సునీల్ కుమార్ రెడ్డి, గౌరవాధ్యక్షులుగా మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచు రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డి, కోశాధికారిగా మునిరెడ్డి, అసోసియేట్ ప్రసిడెంట్ గా మహేంద్ర నాథ్ రెడ్డి, వైస్ ప్రసిడెంట్ గా గోపాల్ రెడ్డి, కార్యదర్శిగా గిరిధర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా శ్రీనివాసరెడ్డిలను ఎన్నుకున్నారు. సభ్యులుగా సుబ్రమణ్యం రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, మురళి రెడ్డి, భాస్కర్ రెడ్డిలు ఎన్నికయ్యారు.

జనసేనకు ఒక్క అవకాశమివ్వండి: వినుత కోటా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీని ఆదరించాలనీ, ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తామని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి వినుత కోటా విజ్ఞప్తి చేశారు. శ్రీకాళహస్తి పట్టణంలోని గోపాలవనంలో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తోట గణేష్, ఉపాధ్యక్షులు రవి కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు ప్రమోద్, కవిత,రాజ్య లక్ష్మి, ఐటీ కోఆర్డినేటర్ కావలి శివకుమార్,మండల అధ్యక్షుడు దండి రాఘవయ్య,పేట చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

రూ.41 లక్షలతో సిసి రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి టౌన్ : మధురానగర్‌లో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డు,డ్రైన్లను టిటిడి ఛైర్మన్, తిరుపతి ఎంఎల్ఏ భూమన కరుణాకర్‌రెడ్డి చేతుల మీదుగా మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్ వరికుంట్ల నారాయణ ప్రారంభించారు. మేయర్ శిరీష మాట్లాడుతూ 41 లక్షల రూపాయల వ్యయంతో మధురానగర్‌లో నిర్మించిన సిసి రోడ్డు, భూగర్భడ్రైనేజ్ పైప్‌లైన్ ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డిఇ విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నిధులు లేవా..నిర్లక్ష్యమా?

- ప్రభుత్వ పాఠశాలలో వాలంటీర్లకు వందనం
- బడి పిల్లలను బయటకు పంపి నిర్వహణ
- సదుపాయాలు, సౌకర్యాల కల్పన లేమిపై విమర్శలు

ప్రజాశక్తి -వాకాడు : వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ఓ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. బడి నిర్వహణ సమయంలో విద్యార్థులను తరిమివేసి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వచ్చిన వారికి సదుపాయాలు, సౌకర్యాలు కల్పించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

'వాలంటీర్లకు వందనం' అనే కార్యక్రమం ఎన్నికల ముందు గ్రామ వాలంటీర్లను బుట్టలో వేసుకునే కార్యక్రమాన్ని తలపిస్తోంది. ప్రభుత్వం ఎన్నికలకు రెండు నెలల ముందు వాలంటీర్లకు భారీ నజరానా ప్రకటించిన విషయం విదితమే. ఈ కార్యక్రమం ప్రతి ఏటా నిర్వహిస్తున్నప్పటికీ ఏడాదిగా వారు చేసిన కష్టానికి ప్రభుత్వం అందజేస్తున్న నగదు చిన్నదని చెప్పారు. ఈ చిన్నపాటి నగదు ప్రోత్సాహాన్ని అందిస్తున్నారే వాలంటీర్లపై ప్రభుత్వం, పాలకులు ఎన్నికలలో ప్రధాన బాధ్యతను తలకెత్తుకునేలా హిత బోధ చేస్తున్నారు. ఎన్నికల్లో వాలంటీరుల పాత్ర ఉండకూడదని సుప్రీంకోర్టు సూచించినప్పటికీ వారానికి రెండుసార్లు పాలకులు ప్రభుత్వ కార్యాలయాల్లోనే సమావేశాలు నిర్వహించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గెలుపునకు కృషి చేయాలని సూచిస్తున్నారు. అంతేకాదు మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి గెలిపించేందుకు వారు సహకరిస్తే వాలంటీరులకు స్థానికంగా ఉద్యోగాలు ఇప్పించి జీవితాలు మారుస్తామని, వారిలో ఆశలు రేకెత్తిస్తున్నారు. మరి అదే నిజమైతే మానస పుత్రికలుగా చెప్పుకునే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఆయన అమలు చేసిన ప్రభుత్వ కార్యక్రమాలు అన్నిటినీ ఐదు సంవత్సరాల పాటు భుజస్కందాలపై మోసి ప్రజలకు ప్రభుత్వ ఫలాలను నిస్వార్థంగా చేరవ చేసిన వాలంటీర్లకు జీవితాలు ఏ మేరకు మెరుగుపడ్డాయో అర్థం చేసుకోవచ్చు.

వాలంటీర్లకు వందనం మండలంలో ఎంపిడివో గోపినాథ్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించడం చర్చకు దారితీస్తోంది. పాలకులు ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొని అనంతరం ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అయితే వారి ప్రయాణ వెసులుబాటుకు అనుగుణంగా పాఠశాల జరుగుతున్న సమయంలో విద్యార్థులను బయటకు పంపించి పాఠశాల గదుల్లో కార్యక్రమం నిర్వహించడం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేశారు. అంతే కాదు ఈ కార్యక్రమానికి సరిగా వాలంటీరులు వచ్చి హాజరు నమోదు చేసుకోకపోతే వారికి వచ్చిన ప్రోత్సాహక నగదు చెక్కులను ఇవ్వబోమని ఎంపిడీవో గోపినాథ్ వాలంటీరులపై హుకుం జారీ చేయడంతో చంటి బిడ్డలను చంక నేసుకుని మహిళా వాలంటీర్లు కార్యక్రమానికి హాజరయ్యారు. మండల కేంద్రానికి దాదాపు 40 కిలో మీటర్లకు పైగా దూరం నుంచి వచ్చిన వాలంటీర్లకు సైతం భోజనం సంగతి సరే.. మంచినీళ్ల కూడా ఇచ్చిన పాపాన పోలేదని వారు వాపోతున్నారు. పాలకులు మాత్రం ప్రభుత్వాన్ని గెలిపించే దుకు వాలంటీర్లు చేయాల్సిన విధులను గంటల తరబడి వివరించి

ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన 'వాలంటీర్లకు వందనం '

నెమ్మదిగా అక్కడి నుంచి జారుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ, ప్రస్తుత గూడూరు నియోజకవర్గ వైసిపి అభ్యర్థి మేరుగ మురళీధర్ సైతం వారి ప్రసంగాన్ని గంటల తరబడి విన్న వాలంటరీలపై కనికరం లేకుండా ఉపన్యాసం అనంతరం వదిలేసి వెళ్లిపోయారు. దీంతో సదుపాయాలు, సౌకర్యాలు లేక వాలంటీర్లు , పాఠశాల సమయంలో తరగతి గదుల నుంచి బయటకు పంపడం పట్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రభుత్వం లేదా పాలకులు నిధులు వెచ్చించి చేయాల్సిన కార్యక్రమాన్ని పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించడం చూస్తుంటే నిర్వహణ అధికారి పనితీరుపై 'నిధులు లేవా లేక నిర్లక్ష్యమా?' అనే సందేహం వ్యక్తం అవుతోంది.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మేరకు, తిరుపతి జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలతో గూడూరు పట్టణంలోని, పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు అన్ని వసతులు సక్రమంగా ఉన్నాయా ..లేవా;? టాయిలెట్లలో లైట్లు, పోలింగ్ కేంద్రాలలోకి వెలుతురు బాగా వచ్చేలా కిటికీలు ఉన్నాయా లేవా? అని పరిశీలించినట్లు గూడూరు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి ఎటువంటి అసౌకర్యాలు లేకుండా, అన్ని వస తులను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. పట్టణంలోని 46 పోలింగ్ కేంద్రాలను పరిశీలించామని గూడూరు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. గూడూరు పట్టణం లోని ఎంపీడీవో కార్యాలయంలో, ఎంఈఓ కార్యాలయంలోని పోలింగ్ కేంద్రాలను సచివాలయం సెక్రటరీలతో, మున్సిపల్ అధికారులతో సందర్శించారు. వికలాంగులకు, వృద్ధులకు ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు రావడంతో వాటిని గుర్తించి, ఆ పోలింగ్ కేంద్రాలలో అవసరమైన అన్ని వసతులు ఉండేలా చూస్తామన్నారు. ఆయన వెంట గూడూరు మండల విద్యాశాఖ అధికారి 2, కోడూరు మండల పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్, గూడూరు మండల కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.

సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలి: కమిషనర్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని మంత్రి ఆర్కె రోజా ఆదేశాలు వార్డు ప్రజలకు సౌకర్యాలు అందుబాటులో తీసుకు రావడం, అభివృద్ధి పనులకు సంబంధించి వాటిని సక్రమంగా పాటించాలని మున్సిపల్ కమిషనర్ కే ఎల్ ఎం రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో 18 ,19 వార్డు కౌన్సిలం, వార్డు ప్రజలతో నిర్వహించిన రివ్యూ సమావేశంలో పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ మంత్రి ఇచ్చిన సలహాల మేరకు వార్డు ప్రజలకు సౌకర్యాలు అందుబాటులో తీసుకు రావాలని అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. నేడు రూ.80 లక్షల రూపాయల అంచనా మొత్తం తో పూర్తి చేయబడిన యు పి హెచ్ సి గోవింద పాలెం హెల్త్ సెంటర్ నేడు మధ్యాహ్నం 3.30 గంటలకు మంత్రి చేతుల మీదుగాప్రారంభించనున్నట్లు తెలిపారు. పట్టణ పరిధిలోని పొదుపు సంఘం సభ్యులతో జె ఎం ఎం (జగనన్న మహిళా మార్ట్) సూపర్ మార్కెట్ ఏర్పాటు చేయుటకు ఆర్ పి లు, మెప్మా సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి వారికి కెఎంఎం సూపర్ మార్కెట్ సంస్థ ఏర్పాటుకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బందులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయమే లక్ష్యం

న్యాయ విజ్ఞాన సదస్సులో సీనియర్ న్యాయవాది లక్ష్మీపతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సామాజిక న్యాయం అందించడమే న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యం అని పుత్తూరు సీనియర్ న్యాయవాది లక్ష్మీపతి పేర్కొన్నారు. పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర ఆదేశాల మేరకు స్థానిక కాపు వీధిలోని ఎంపీయూపీ పాఠశాలలో న్యాయ సేవ దినోత్సవం, న్యాయ విజ్ఞాన సదస్సును పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు ఈ సందర్భంగా న్యాయవాది లక్ష్మీపతి మాట్లాడుతూ పేద, ధనిక భేదం లేకుండా, చట్టపరంగా ప్రజలందరికీ సమానం న్యాయం కల్పించాలని ఐక్యరాజ్యసమితి పిలుపు నిచ్చిన రోజుకు గుర్తుగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు, న్యాయ సేవ అధికారి సంస్థ ప్రకృతి వైఫల్యాలకు గురైన వారికి షెడ్యూల్ కులాలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మురళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్ఐవి వ్యాప్తిపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్, నారాయణవనం: హెచ్ఐవిపై అవగాహన కలిగి ఉండాలని మన సంస్కృతి కళాబృంద సంస్థ ప్రధాన కార్యదర్శి కళాకారుడు రెడ్డప్ప పేర్కొన్నారు. పుత్తూరు, నారాయణవనం మండలం కీళగరంలో హెచ్ఐవిపై ఆంధ్రప్రదేశ్ కంట్రోల్ సొసైటి ఆదేశాలతో తిరుపతి జిల్లాఅడిషనల్ డిఎంఅండ్‌హెచ్ ఓ అరుణ సులోచన ఆదేశాల మేరకు మన సంస్కృతి కళా సంస్థ ప్రధాన కార్యదర్శి కళాకారుడు రెడ్డప్ప, స్టెప్స్ నగరి ప్రివెన్షన్ యూనిట్ ప్రాజెక్టు మేనేజర్ ఆరుముగం హెచ్ఐవి సోకే విధానాలపై అవగాహన కల్పించారు. కళాకారులచే హెచ్ఐవి, ఎయిడ్స్‌పై పాటలు, నాటక రూపంలో ప్రదర్శన నిర్వహించారు. హాస్పిటల్లో ఇంజక్షన్ ఒకరికి వేసిన నీడిల్ తో మరొకరికి వేస్తే హెచ్ఐవి వచ్చే అవకాశం ఉందని, కటింగ్ షాపులో ఒకరికి వాడిన బ్లేడు మరొ కరికి ఉపయో గించినా, అ రక్షిత లైంగిక సంబం ధాల వల్ల హెచ్ఐవి వచ్చే అవకాశం ఉందనిఅప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. ఈ కార్యక్ర మంలో ఐసిటిసి కౌన్సిలర్ చెంచమ్మ, కళాబృందం ఏ నాగేంద్రరావు, కె విజయ్ కుమార్, దేవేందర్, స్టెప్స్ నగరి అవుట్ రిచ్ వర్కర్ భువనేశ్వరి, అరుణాలత, సాము, నరేష్ ,అరుల్, చిన్నబ్బ ,హెచ్ఆర్జీలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

నారాయణవనం కార్యక్రమంలో కళాబృందం నారాయణవనం మెడికల్ ఆఫీసర్, ఎఎన్ఎం, దేవేందర్, స్టెప్స్ నగరి అవుట్ రిచ్ వర్కర్ సాము, నరేష్ ,అరుల్, ప్రియా, చిన్నబ్బ ,హెచ్ఆర్జీలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై భౌతిక దాడులు అరికట్టాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: అనంతపురంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సిద్ధం సభలో వీడియోలు చిత్రీకరిస్తున్న ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ కృష్ణ పై వైసీపీ అల్లరి మూకలు విచక్షణా రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరచడం అన్యాయమని దాడి చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి తక్షణమే వైసీపీ గుండాలను అరెస్టు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సత్యవేడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బియన్ కండ్రిగ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బొర్రా వేణు, బియన్ కండ్రిగ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట బైఠాయించి, డిప్యూటీ తహశీల్దారుకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి, సిపిఐ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులను ముఖ్యమంత్రి చూసీచూడనట్లుగా వ్యవహరించడం బాధాకరమని, మానవత్వంతో స్పందించని ప్రభుత్వం సామాన్యులకు న్యాయం చేస్తామంటే ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. రిపోర్టర్‌పై జరిగిన దాడిలో పోలీసులు పాత్ర కూడా ఉండి ఉంటుందని, సిద్ధం సభలో రాష్ట్ర పోలీసు శాఖ మొత్తం అక్కడ ఉన్నా భౌతిక దాడిని అరికట్టలేకపోవడం రాష్ట్రంలో భద్రత కరువైందని తెలుపుతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఈ ప్రభుత్వానికి చరమ గీతం పాడుతారని వాపోయారు. ఈ కార్యక్రమంలో బి యన్ కండ్రిగ టిడిపి సీనియర్ నాయకులు, సీపీఐ నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

బిన్ కండ్రిగలో నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు, టిడిపి, సిపిఐ నాయకులు

తిరుపతి(మంగళం): ఫొటో జర్నలిస్టుపై దాడి అమానుషమని ఆర్యవైశ్య సంఘం తీవ్రంగా ఖండిస్తోందని ఆ సంఘం నాయకులు పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయ పాలకమండలి కార్యదర్శి దిండుకుర్తి నరసింహులు, శ్రీధర్, హేమచందర్, సుకుమార్, మధుసూదన్, రామ్మూర్తి, సురేష్ ఈ మేరకు ఖండించారు.

సూళ్లూరుపేట: ఆదివారం అనంతపురంలో జరిగిన సిద్ధం సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్న సమయంలో ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ శ్రీ కృష్ణ పై వైసిపి నాయకులు కొంత మంది మూకుమ్మడిగా దాడి చేయడం హేయమైన చర్య అని సూళ్లూరుపేట సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్‌కే రియాజ్ తీవ్రంగా ఖండించారు. దాడి చేసిన వారిపై వెంటనే చట్టపరమైన చర్య తీసుకోవాలని కోరారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీకృష్ణ పై జరిగిన దాడిని సూళ్లూరుపేట సిపిఎం పట్టణ కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

క్యాంపస్ : అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసిపి రౌడీ మూక దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కో కన్వీనర్ అశోక్ కుమార్ , యూనివర్సిటీ కార్యదర్శి వినోద్ అన్నారు. ఫోటో జర్నలిస్ట్‌పై దాడి చేసిన వైసిపి అల్లరి మూకలను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ నేతలు ప్రకాశం భవనం ఎదుట ఆందోళన చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని, చట్టాలను ఏమాత్రం గౌరవించకుండా వైసీపీ నేతలు, కార్యకర్తలు దాడులు చేయడం పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫొటో జర్నలిస్ట్ పై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని , జర్నలిస్టులకు రక్షణగా నిలవాలని,ఈ ఘటనలో దోషులను తక్షణమే అరెస్టు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మౌనిక, నరేంద్ర, వీరేష్, దేవరాజులు, సాయి నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌వియూ క్యాంపస్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఉమ్మడి అభ్యర్థి గెలుపే ధ్యేయంగా పనిచేయాలి: జనసేన

ప్రజాశక్తి - గూడూరు రూరల్: జనసేన, టీడీపీల ఉమ్మడి అభ్యర్థి గెలుపే ధ్యేయప్రజుంగా జనసైనికులు పనిచేయాలని జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు కోరారు. జనంలోకి జనసేన, భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గమళ్ళపాలెం, కటకరాజా వీధి, మహాలక్ష్మమ్మ వీధి, అంకమ్మ వీధిల్లో టిడిపి గూడూరు ఇన్‌ఛార్జి పాశం సునీల్ కుమార్ సతీమణి సంధ్యా రాణి, నాయకులతో కలిసి నిర్వహించిన ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రాక్షస పాలన అంత మొందించేందుకు జనసేన, టీడీపీ కలిసి పోటీ చేస్తున్నాయన్నారు. పొత్తులో భాగంగా గూడూరులో ఉమ్మడి అభ్యర్థిగా ఎవరు పోటీ చేయాలనే విషయం పవన్ కళ్యాణ్, చంద్రబాబు నిర్ణయిస్తారని ఉమ్మడి అభ్య ర్థి ఎవరైనా గెలుపునకు కృషి చేయా లన్నారు. మాజీ కౌన్సి లర్ పులిమి శ్రీనివాసులు మాట్లా డుతూ రాబో యేది ప్రజా ప్రభుత్వమే అని రాబో యే ఎన్నికల్లో ప్రజలు వైసీపీని తరిమి కొట్టడం ఖాయ మన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన ఉమ్మడి కార్యక్రమాల పీఓసీ మోహన్, రాజ శేఖర్, కుమార్, కోటా వెంకటేశ్వర్లు,ఓంకార్, శ్రీనాథ్, సూర్య,సాయి,శివ, విజయ్, నారాయణ, మనోజ్, కోటి, వసంత్ టీడీపీ రాష్ట్ర నాయకులు శీలం కిరణ్ కుమార్, శ్రావణి రెడ్డి, మాజీ కౌన్సిలర్లు బిల్లు చెంచురామయ్య, భారతి, పిల్లెల్ల శ్రీదేవి, గురవయ్య, కొడిపర్తి కల్పన,రహీమ్, అల్లి భాయ్, పులిమి శివకుమార్, శ్రీనివాసులు, చిన్నా పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న జనసేన, టిడిపి నాయకులు

తుమ్మలగుంట ఆక్రమణలు తొలగిస్తాం

హాథీరాంజీ మఠం ఫిట్ పర్సన్ రమేష్‌నాయుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట పరిధిలోని హాథీరాంజీ మఠం భూములను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను పూర్తిగా స్థాయిలో తొలగిస్తామని మఠం డిప్యూటీ కలెక్టర్, ఫిట్ పర్సన్ రమేష్‌నాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రమేష్ నాయుడు మాట్లాడుతూ మఠం భూములను ఆక్రమించి కొందరు కబ్జారాయుళ్లు ప్లాట్స్‌గా విక్రయించి అక్రమ భూదందా చేస్తున్నారని, ఈ నెల 15న రెవెన్యూ, మఠం అధికారులు సంయుక్తంగా అక్రమించి నిర్మిస్తున్న ప్రహరీగోడలను తొలగించారన్నారు. కొంత మంది నిర్మాణాలను కొనసాగిస్తున్నారనే సమాచారంతో సోమవారం తిరుపతి రూరల్ తహశీల్దారు మహబూబ్ చాంద్, మఠం ఏఈఓ శ్రీనివాసులురెడ్డి మఠం భూములను సందర్శించారన్నారు. ఆ సమయంలో ఆక్రమణ దారులు వారిని అడ్డుకోవడమే కాకుండ చుట్టుముట్టి వాగ్వాదానికి దిగారని, మఠం భూములను ఆక్రమించడం, కట్టడాలను కొనసాగిస్తే వాటిని కూల్చివేసి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మఠం భూములను దొంగదారిలో విక్రయించి సామాన్యులను మోసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

క్రైం న్యూస్

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రభుత్వ నిబంధలనకు విరుద్ధంగా అక్రమంగా తీసుకొస్తున్న 24 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ తెలిపారు. గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ గూడూరు మండల పరిధిలోని మెగనూరు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అరెస్ట్ చేశామన్నారు. అతని దగ్గర 24 బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు ఆయన తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని బాలిక మృతి

ప్రజాశక్తి -రేణిగుంట : రేణిగుంట మండలం గాజుల మద్యం పంచాయతీలో మంగళవారం సాయంత్రం డాక్టర్ ఢీకొని ఐదేళ్ల బాలిక మృతి చెందింది. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వికాస్ భార్యా బిడ్డలతో వలస కూలీగా ఇక్కడికి వచ్చాడు. ఈ క్రమంలో శ్రీ మారుతి బ్రిక్స్ పరిశ్రమలో ఇటుక కూలీగా భార్యాభర్తలిద్దరూ పనిచేస్తున్నారు. కూతురు నిద్రపోతుండగా ట్రాక్టర్ వెనక నుండి తిప్పుతూ పాపను ఢీకొనడంతో పాప చాందిని తీవ్రంగా గాయపడింది. వెంటనే పాపని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా మిద్దిల హరి

ముఖ్యమంత్రిని కలిసిన మిద్దిల హరి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ బోర్డు వైస్ ఛైర్మన్ గా వైసీపి జిల్లా అధ్యక్షులు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, మాజీ ఆప్కో డైరెక్టర్ మిద్దిల హరిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మిద్దిల హరి వర్గీయులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి మిద్దిల హరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఆర్టీసీ వైస్ ఛైర్మన్ గా వున్న విజయానంద్ రెడ్డిని చిత్తూరు అసెంబ్లీ వైసీపి ఇన్‌ఛార్జిగా నియమించడంతో విజయానంద్ రెడ్డి ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆ పదవి శ్రీకాళహస్తికి చెందిన మిద్దిల హరిని వరించింది. బుధవారం విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో బోర్డు సమావేశం వుంది. ఈ సమావేశంలో మిద్దిల హరి ఆర్టీసీ వైస్ ఛైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.

న్యాయం చేసి ఆదుకోండి..

తహశీల్దారుకు ముస్లిం కుటుంబాల వినతి

ప్రజాశక్తి - కోట : ఎన్నో సంవత్సరాలుగా తమ ఆధీనంలో ఉన్న భూమిని ముస్లిం కుటుంబాలకు ఉపయోగపడేలా న్యాయం చేయాలని చిట్టేడు ముస్లిం మైనారిటీలు ఎస్ కే రఫీ, మస్తాన్ బాష, అమీర్ బాష కోరారు. ఈ సందర్భంగా మంగళవారం కోట మండలంలోని స్థానిక తహశీల్దారు కార్యాలయంలో చిట్టేడు గ్రామానికి చెందిన ముస్లిం కుటుంబాలు తహశీల్దారు డి నాగరాజరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ ముస్లిం కుటుంబాలకు కోట మండలంలోని టీడీపీ నాయకులు, కోట ఎంపీటీసీ షేక్ షంసుద్దీన్ మద్దతు పలికారు. అనంతరం చిట్టేడు ముస్లిం సోదరులు రఫీ, అమీర్ బాష, మస్తాన్ సాహెబ్ మాట్లాడుతూ చిట్టేడు గ్రామం అంకమ్మ మిటలో తమ పూర్వీకుల కాలం నుండి సర్వే నంబర్ 341 లో 2-20 ఎకరాలు తమ ఆధీనంలో ఉండి శ్మశాన వాటిక, రంజాన్, బక్రీద్‌లు లాంటి మరెన్నో వాటికి ఉపయోగించుకుంటున్నామని తెలిపారు. అదే గ్రామానికి చెందిన షెడ్యూల్ తెగ ఎరుకుల కులానికి చెందిన వారికి ముస్లిం శ్మశాన వాటికను వారికి ఇవ్వాలనే యత్నిస్తున్నారన్నారు. ఇప్పటికైనా స్పందించి తమ ఆధీనంలో ఉన్న భూమిని తమకే దక్కేలా న్యాయం చేయాలని తహశీల్దారును కోరారు. తహశీల్దారు స్పందించి స్థానిక ఆర్ఐ, సర్వేయర్, విఆర్ఓ లతో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలిస్తామని ముస్లిం మైనారిటీలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిట్టేడు ముస్లిం మైనార్టీలు పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈనాటి బాలలే రేపటి పౌరులు.. ఎన్నికల నిర్వహణ పోలింగ్ పై అవగాహన కల్పించేందుకు మాక్ పోలింగ్ నిర్వహించామని గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూలు కరస్పాండెంట్ శివకుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని దర్గా వీధిలో శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులకు పోలింగ్ ప్రక్రియ, ఓటు వేసే పద్ధతిని తెలిపారు. చిన్నారులు ఆసక్తిగా ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్ మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి భారతీయుడు హక్కు అని చిన్నతనం నుండి ఓటింగ్ గురించి తెలిపేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని మంచి నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్లయ్య, వాసు, రాఘవయ్య, మస్తాన్ బి, నజీరా, మంజుల, హరిత, గౌరీ విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

'విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి'

ప్రజాశక్తి -దొరవారిసత్రం: ప్రతి విద్యార్థి విద్యాభ్యాసంతో పాటు, వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని దొరవారి సత్రం పిహెచ్‌సి వైద్యాధికారి వి చైతన్య సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంజెపి గురుకుల పాఠశాలలో ఆరోగ్య సిబ్బంది మెడికల్ క్యాంప్ మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాధారణ వ్యాధులకు చికిత్స అందించారు. టైఫాయిడ్ అనుమానిత విద్యార్థులను పిహెచ్‌సిలో రక్త పరీక్షలు చేయించుకోవాలని సిఫార్సు చేశారు. ప్రతి విద్యార్థి అనారోగ్యానికి గురికాకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. శారీరక పరిశుభ్రత పాటించి గజ్జి, తామర వంటి వ్యాధులను దూరం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్ పి మౌనిక, ఏఎన్ఎం డోరతి, శ్రావణి, హెచ్ ఎ సుధాకర్, గురుకుల కళాశాల స్టాఫ్ నర్స్ రెడ్డమ్మ, మోనిషా పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలను మారిస్తే జగన్ గెలుస్తాడా?

- దంపూరు భాస్కర్ యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వైసిపి మళ్లీ అధికారంలోకి రావడానికి జగన్ ఎమ్మెల్యేల స్థానాలను మార్చినంత మాత్రాన గెలుస్తాడనుకోవడం భ్రమేనని టిడిపి రాష్ట్ర కార్యదర్శి దంపూర్ భాస్కర్ యాదవ్ అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో సిద్ధం హోర్డింగులు ఎవరి నిధులతో ఏర్పాటు చేశారో చెప్పాలన్నారు. రాష్ట్రంలో భూములు, ఇసుక ప్రకృతి సహజ వనరులను ఇష్టానుసారంగా దోచుకున్న వైసిపి సర్కారుకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి ఎదురు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రకోటి సదాశివం, ఆనంద్ యాదవ్, రామ్మూర్తి, జగన్నాథం, హేమంత్ రాయల్, వెంకటేష్, మునికృష్ణ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు అభినందనలు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి ఉమెన్స్ డిగ్రీ , పీజీ కళాశాల, తిరుపతి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు వక్తృత్వ పోటీల్లో బహుమతులను సాధించారు. వీరిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి నారాయణమ్మ అభినందించారు. ప్రధానమంత్రి వికసిత్ భారత్ 2047 ప్రణాళికను విద్యార్థినులు ముందుకు తీసుకుపోవాలని ఆకాంక్షించారు. ప్రధానమంత్రి పంచ్ ప్రాణ్ లో భాగంగా జరిగిన పోటీలలో విద్యార్థినులు విస్తృతంగా పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లుగా విద్యార్థినులు ఉండటం వల్ల సమాజ శ్రేయస్సుకు కృషి చేస్తారనే సందేశాన్ని అందించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్. వి. కృష్ణవేణి, తెలుగు విభాగాధిపతి మాట్లాడుతూ విద్యార్థినులలో సేవా భావం పెంపొందడానికి ఈ కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్. సి. దివ్యవాణి, కెమిస్ట్రీ ఉపన్యాసకులు మాట్లాడుతూ విద్యార్థినుల సర్వతో ముఖాభివృద్ధికి ఎన్ఎస్ఎస్ ఆలంబనగా నిలుస్తుందన్నారు. కళాశాల యూనియన్ ఇన్‌చార్జ్ డాక్టర్. సి. భువనేశ్వరి, కామర్స్ విభాగాధిపతి డాక్టర్. కె. మల్లేశ్వరి విద్యార్థినులకు అభినందనలు తెలిపారు.